# సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి

- పురాణం సుబ్రహ్మణ్య శర్మ

ఒకప్పుడు 'కొవ్వలి' అనే పేరు తెలుగు నవలా ప్రపంచంలో గొప్పగా మారుమ్రోగింది. తెలుగులో సాధారణ పాఠకుల్ని ఆకర్షించి వారిచేత నవలలు చదివించిన ఘనత కొవ్వలి వారిదే. బజారు నవలలు, రైల్వే నవలలుగా యివి పేరు పొందాయి. ఈ వరుసలో జంపన, కృత్తివెంటి అనే రచయితలు ప్రవేశించారు గాని వీరెవరికీ కొవ్వలి వారికి వచ్చినంత పేరు రాలేదు. తెలుగులో వేయికి పైగా నవలలు వ్రాసినది కొవ్వలి వారే. ఒకప్పుడు ఎవరి చేతిలో చూసినా కొవ్వలి వారి నవలలే.

ఈయన తండ్రి రాజయోగి లక్ష్మీ నారాయణ శర్మగారు. సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి అనే 547 డెమ్మీ 1/8 సైజు నవలను 'కథాసృష్టి అండ్ రచన' చేసి ద్రావిడులైన సి.వి. కృష్ణాబుక్ డిపో, మద్రాసు -1 వారు రు. 25/- ధరకు ప్రకటించి విడుదల చేశారు. కొవ్వలివారు దీనిని కావ్య కన్య అన్నారు. దక్షిణ దేశమంతటా వేల సంవత్సరాల క్రితం . నుంచీ వీధినాటకాలుగా 'అపూర్వచింతామణి'ని ప్రదర్శించేవారు. దీనిని నాట్య కథ అని కూడా అన్నారు. దీనిని నవలగా రాసి యిమ్మని కొవ్వలి వారిని ప్రచురణ కర్తలు కోరగా రాసినది. ఈ జానపదకథలో ప్రస్తుత రాజకీయాలు, అహింసా సిద్ధాంతము, అభ్యుదయ భావాలను జోడించి కొవ్వలి వారు యీ నవల సృష్టికి పూనుకున్నారు. పాఠకలోకానికి యిది ఒక నూత్న కళాసృష్టిగా ప్రచురణకర్తలు పేర్కొన్నారు.

ఈ నవలకు ముందు శ్రీరస్తు, శ్రీరామ కృష్ణ పరబ్రహ్మణేనమః ప్రారంభంలో 'ఓం' 'శుభమస్తు' అని ప్రకాశకులు పేర్కొన్నారు. మగధ దేశాధిపతి కీర్తికాముడు. రాజధాని కుండిన నగరం, ధర్మపాలన సాగిస్తూ ప్రజా రంజకంగా పరిపాలిస్తూ వస్తున్నాడు. అతని కుమార్తె స్పృహ లేక చావుబతుకులలో వున్నది. రాజవైద్యులు ప్రయత్నిస్తున్నారు. ఎవరికీ మనస్థిమితంలేదు. రాకుమార్తె పళ్ళు గిట్ట కరుచుకుని వుండిపోయాయి. మందులు ఏవీ మింగించలేకుండా వున్నారు. రాణి మంజులా దేవి దుఃఖం చెప్పనలవిలేదు. బిల్వ నగరంలో రాణీ గారి అన్నగారున్నారు. జన్మదినం నాడు చెలులతో కలసి రాకుమారి ఉయ్యాల వూగుతూండగా వుయ్యాల మీంచి కిందపడిందట. కెవ్వునకేక వేసి స్పృహ తప్పిపోయిందట. నోటంట నురుగులు గ్రక్కిందట. తరువాత మందులు మింగిందట. చాలా ఎత్తు మీంచి పడిందని చెలికత్తె శోభ చెప్పింది. తాటి చెట్టు ఎత్తుమీంచి కింద ఇసకలో పడేటప్పటికీ మెదడు దెబ్బతిన్నదని వైద్యుడు అన్నాడు. దేవీ మంజుల కోటబావి దగ్గర ఆత్మహత్యా ప్రయత్నంలో వుంది. అప్పుడు ఒక పరిచారకుడు బైరాగిని జైలు నిర్బంధంనుంచి తెచ్చి ప్రవేశ పెట్టాడు. చింతామణికి పన్నెండేళ్ళు నిండాయి. తన వంశం అంతరించిపోతుందని రాజు భయపడుతున్నాడు. బైరాగి చిన్న సీసాలోని చూర్ణాన్ని తీసి చింతామణి ముక్కుకు దట్టించి చెవిలో శంఖంతో పెద్దగా గట్టిగా ఊదగా ఆమె కళ్ళు విప్పి 'దాహం' అని అడిగింది. ఆమె బావ ఆనందుడు కూడా ఆమెను చూడటానికి వచ్చాడు. తాగినంతమజ్జిగ యిచ్చారు బైరాగి పనుపున. ఆ బైరాగికి ఒక ప్రశాంత మందిరం ఏర్పాటు చేయించి అందులోవుండమని రాజదంపతులు ప్రార్థించారు. ఇతని పేరు బాలమహర్షి. చింతామణి జీవితం అపూర్వమైనది కనుక అపూర్వ చింతామణి అని పిలువమని బాలమహర్షి అదేశించాడు. ఈ రాజు బావమరిది ధర్మపాలుడు కాంచన నగరాధిపతి. ఈ మహర్షి వుండే భవనం పూదోటలోని శాంత భవనం. మంజులా దేవి చింతామణిని ధర్మపాలుని కుమారుడు ఆనందునికిచ్చి వివాహం చేయాలని ఉవ్విళూరుతుంది. బాలమహర్షి వద్దకు విద్యాభ్యాసానికి చింతామణి వెళ్తూవుండేది. తర్క శాస్త్రం, వ్యాకరణ శాస్త్రం, చిత్రలేఖనాలు నేర్చుకుంటూ వున్నది గురువు వద్ద. ఆ విధంగా మూడు సంవత్సరాలు బాలమహర్షి కుండిన నగరం లోగడిపాడు. ధర్మ శాస్త్రము, నీతి శాస్త్రము, గీతా రహస్యం ఆదిగాగల ఎన్నో శాస్త్రాలు చింతామణికి బైరాగి గురువు నేర్పాడు. చింతామణి యుక్త వయసుయై పుష్పవతి అయినది. ఆ ఉత్సవాలలో బైరాగి పాల్గొన్నాడు. రాజకుమారులు చింతామణినిని వివాహమాడేందుకు చిత్రపటాలు పంపి రాయబారాలు సాగిస్తున్నారు. చింతామణి మనసు ఆనందుని మీద వుంది. ఆనందుడి చిత్ర పటాన్ని చింతామణి చాలా చక్కగా

రాజకుమారులు చింతామణినిని వివాహమాడేందుకు
చిత్రపటాలు పంపి రాయబారాలు సాగిస్తున్నారు.
చింతామణి మనసు ఆనందుని మీద వుంది. ఆనందుడి
చిత్ర పటాన్ని చింతామణి చాలా చక్కగా వ్రాసింది.

వ్రాసింది. యుక్త వయస్కురాలైనందున ఆమెను అంతఃపురందాటి పోనివ్వలేదు. అది అప్పటి ఆచారం. చదువులు చాలించమని యింట్లో పెద్దలు ఆంక్షలు పెట్టారు. శోభ గురువు చెవిన ఆమెయిక రాదని చెబుతుంది. గురువు తను చెప్పినట్లు చేస్తానని చింతామణి నుంచి మాట తీసుకుంటాడు. సామాన్యులకు అసాధ్యమైన ఒక క్రతువును శిష్యురాలికి నిర్దేశిస్తాడు. తల్లిదండ్రులకు సమ్మతం అయినా కాకపోయినా చేయాలని మాట తీసుకుంటాడు. గురువాజ్ఞలు మీర కూడదంటాడు. చింతామణిని వివాహమాడే వరుడు ఆమె అడిగే కొన్ని ప్రశ్నలకు సరియైన సమాధానాలు చెప్పాలి. చెప్పలేని రాకుమారుని శిరస్సు ఖండించి కోట గోడకు వ్రేలాడ గట్టాలి. తల్లిదండ్రులకు తప్ప ఏయితర వరునికి కనపడకూడదు. తగిన రాజకుమారుడు వచ్చి జవాబులు చెప్పి చింతామణిని పెళ్ళాడే వరకు ఆమె శాంతిభవనం దాటి వెళ్ళకూడదు. ఈ ఏర్పాట్లు అన్నీ చేయించమని బైరాగి ఆదేశిస్తాడు. దీక్షా కంకణం ధరించిన తరువాత ప్రశ్నలు చెబుతానంటాడు. శోభ సందేహిస్తుంది. కాని బెదురువల్ల మాట్లాడదు. ఆనందుని ప్రస్తావన వచ్చినప్పుడు దైవ నిర్ణయం ఎలావుంటే అలా జరుగుతుందని అంటుంది చింతామణి. శోభను చింతామణి అక్కా అని అంటుంది. తల్లిదండ్రులు యీ నియమాలకు ఒప్పుకున్నారా అని అడిగితే ప్రాణ భిక్ష పెట్టిన గురువు విద్యా దానం చేసినవాడు గనుక ఒప్పుకున్నానని చింతామణి చెబుతుంది. అన్నకొడుకు ఆనందునికి పిల్లనివ్వాలనే మంజుల రాణి కుతూహలం నీళ్ళ పాలయింది. ముహూర్త నిర్ణయం కోసం పిలిపించిన పురోహితుని పంపించేశారు. ప్రజలు కూడా బాల మహర్షి ఏమిచేసినా చింతామణి మంచి కోసమే చేస్తాడనుకోసాగారు. పై సంగతులను చూస్తే, రాచరికంలో రాకుమార్తెలకు గిరాకే ఎక్కువని, బైరాగులను అందరికంటే ఎక్కువగా రాజులు సైతం ఆదరించే వారనీ, రాజు గారి సొంత సమస్య ప్రజలందరి సమస్యగా భావించే వారనీ ఆకాలంలో నగరాలు దూరం దూరంగా వుండేవని. అరణ్యాలు దట్టంగా విస్తారంగావుండేవనీ, డబ్బు వెండి బంగారాలు వజ్ర వైఢూర్యాలుగా వుండేవనీ వాణిజ్యం నిమిత్తం దేశాలు పట్టిపోవడం వుండేదనీ, అంతఃపుర కుట్రలూ కలహాలూ వుండేవనీ తెలుస్తోంది. రాజుకి సర్వాధికారాలు వున్నప్పటికీ మంత్రులే పాలనా బాధ్యత స్వీకరించేవారనీ న్యాయం సర్వదా రాజులే చూసే వారనీ విశదమవుతోంది. కథలోంచి కథ అలా అల్లుకు పోవడం రచనా పద్ధతి. ఆధునిక నవలా రచన వేరు. ఇది తెలుగు జానపద పద్ధతిని అనుసరించి రాసిన నవల అనుకోవాలి. నవలా ప్రపంచానికి మకుటం లేని మహారాజుగా ఖ్యాతిగడించిన 'కొవ్వలి' వారి రచన గనుక ఆ గౌరవం అది పొందుతుంది. ఇందులో అహింసా సిద్ధాంతాన్ని చాలా నేరుపుగా చదువరులకు ఏవిధంగానూ ఆక్షేపణీయంకాని పద్ధతులలో జొప్పించారు. ఆ అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పగల రాకుమారుడు వస్తాడో రాడో, చింతామణికి వివాహం అవుతుందో లేదోనని రాజు రాణి బెంగపెట్టుకుంటారు. మాటయిచ్చి తిరిగి పోవడం రాచవంశానికి మచ్చకదా అని తల్లితండ్రులు బాధపడతారు. అయితే తమ కుమార్తె తల్లి తండ్రులను అడగకుండా బైరాగికి మాట యిచ్చినందుకు తల్లితండ్రులు బాధపడతారు. రాకుమార్తె తన తల్లి తండ్రులను యీ పద్ధతికి ఒప్పించినందుకు గురువు బైరాగి ఆమెకు తనయందున్న భక్తి విశ్వాసాలకు చాలా ఆనందించాడు. దీక్షాతోరణం కట్టి రాకుమార్తెకు అడగవలసిన ఐదు ప్రశ్నలు బైరాగి చెప్తాడు. ఈ కథకు యీ ప్రశ్నలే ఆయువుపట్టు. వీటికి సమాధానం చెప్పలేకనే 999 మంది రాకుమారులు చింతామణి కత్తికి ఎరయారు. అటువంటి ప్రతిజ్ఞను చట్టం కన్నా ఎక్కువగా ఆ కాలంలో గౌరవించేవారు కాబోలు. ఈ కథంతా కల్పితం. వీధి నాటకాలలోని కథ ఎన్నో కాలానుగుణమైన మార్పులకు లోనయి వుంటుంది.

1. ప్రతిజ్ఞ నెరవేరితేగాని పెళ్ళిచేసుకోనని భీష్మించుకు కూర్చున్న ఆ రాజకుమారుడెవరు ? అతని ప్రతిజ్ఞ ఏమి ? అతనింకా జీవించి వున్నాడా ?

2. పురుషుడై వుండిన్నీ స్త్రీ రూపంతో మహర్షిని మోసం చేసి అతని దగ్గరుండే మంత్ర శూలమునపహరించి అతనిని కొట్టి తరిమివేసిన ఆ యువకుడెవడు ? అతనింకా బ్రతికే వున్నాడా ? మృతుడైనాడా ?

3. తపోధన మహారాజు ద్వితీయ భార్య అయిన రూప సుందరి గతి యేమైనది ? ఆ తపోధన మహారాజింకా బ్రతికేవున్నాడా?

4. ప్రేమించే వాని యందుండే అనురాగం వల్ల అడవిలో తిరుగుతూ స్త్రీ అయి వుండిన్నీ పురుష వేషం ధరించి మహర్షిచే కామించబడిన ఆ యిరువురు కాంతలనూ అపహరించి మహర్షిని ఖండింపచూసిన ఆ ధీరురాలెవరు ? ఇప్పుడామె జీవించి ఉన్నదా ? మృతినొందినదా ?

*చింతామణిని వివాహమాడే వరుడు ఆమె అడిగే కొన్ని ప్రశ్నలకు సరియైన సమాధానాలు చెప్పాలి. చెప్పలేని రాకుమారుని శిరస్సు ఖండించి కోట గోడకు వ్రేలాడ గట్టాలి. తల్లిదండ్రులకు తప్ప ఏయితర వరునికి కనపడకూడదు. తగిన రాజకుమారుడు వచ్చి జవాబులు చెప్పి చింతామణిని పెళ్ళాడే వరకు ఆమె శాంతిభవనం దాటి వెళ్ళకూడదు.*

5. శ్రీరామ పట్టాభిషేకమున శివతాండవం చేసిన భక్తురాలిని మహర్షి కామించిన కారణం వలన ఆ యిరువురనూ కారాగృహమున బంధించి వ్యభిచార నిర్మూలనకు పాటుపడే దత్తాత్రేయ మహరాజు యింకా బ్రతికి వున్నాడా? భక్తురాలెట్లున్నది?

ఆ బైరాగి తనకు జరిగిన పరాభవాల గురించి ప్రశ్నలు వేయించడంలోని కుతంత్రం కంటే ఆ వ్యవహారాలను తాను తిరగ దోడి ఆయా స్త్రీలను అనుభవించాలనే విపరీత కాంక్ష బైరాగిని నవ్వుల పాలు చేయడమే కాక అతడి ప్రాణంమీదకు వచ్చింది. ఈ ప్రశ్నలకు జవాబు చెప్పడం అంతా తనపూర్వ చరిత్రను తానే తిరగదోడుకుని తన కొంపకునిప్పు పెట్టుకోవడం అన్నమాట. కాని కామంచేత కళ్ళు కప్పిన వాడు ఏపనైనా చేస్తాడు. ఫలితం ఆలోచించకుండాఅని అనుకోవాలి. పై ప్రశ్నలకు జవాబులు తెలుసుకోవడంలో కథంతా చిత్ర విచిత్రంగా తయారవుతుంది.

క్రయింథ్రిల్లర్సు, సస్పెన్సు థ్రిల్లర్సు వున్నపుడు యీ జానపద గాథ మటుకు ఎందుకు నవలకాకూడదు ? అందులో రచయిత కొవ్వలి. ఒక వేళ యీ వ్యవహారంలో విపరీత ఫలితాలు కలిగితే గురువు లెంత మాత్రం బాధ్యులు కారని బైరాగి అంటాడు. వివాహమాడ గోరివచ్చిన వరుడు రాగానే గంట మ్రోగుతుంది. సింహద్వారానికి యీ గంటకు సంబంధం వుంది. అక్కడ మీట నొక్కితే గంట మోగుతుంది. అక్కడ ఒకదాని వెనక రెండు నల్లటి తెరలు వుంటాయి. ఈ రెండు తెరల వెనుక రెండు సింహాసనాలున్నాయి. ముందు సింహాసనం మీద చింతామణి కూర్చునివుంటుంది. ఆమె వెనుక తెరలో ఆమె గురువు బైరాగి వుంటాడు. ఈ వేదికకెదురుగా మరి ఒక చిన్న వేదిక అదే యజ్ఞ వేదిక. అక్కడ ప్రశ్నలకు జవాబు చెప్పే రాజకుమారుడు నిల్చొని వుంటాడు. తెరవెనుక నుంచి చింతామణి ప్రశ్నలు వేస్తుంది. ఎదుట నిలచిన వ్యక్తి జవాబులు చెప్పాలి. వేదిక వెనుక తెరలో జవాబులు సరైనవి అవునా కాదా గురువు వింటూ గమనిస్తాడు. సరియైనవి కానపుడు బైరాగి చిరుగంటను మ్రోగిస్తాడు. తెర తొలగగానే తక్షణం తన చేతిలో వున్న కరవాలంతో రాకుమారుని శిరస్సు ఒక్క వేటులో ఖండిస్తుంది. ఆ శిరస్సును శాంతి భవనముఖ ద్వారానికి కట్టిమొండాన్ని ఒక గుంటలో పారవెయ్యాలి. ఒక వేళ జవాబులు సరిపోతే పుష్పహారాన్ని తెర సందునుంచి గురువు అందియ్యగా అది రాజకుమారుడి మెడను అలంకరిస్తుంది.

పైన చింతామణి రాకుమారుల్ని అడిగిన ప్రశ్నల పరంగా కథ విచ్చుకుంటుంది. కథను విప్పడం ముగించటం చాలా చాక చక్యంగా అమిత నేర్పుతో జరుగుతుంది. ఇటువంటి కృత్రిమ కథలు సహస్రవికసిత దళపద్మాల్లాటివి. రత్నాలు కొంచెం నకిలీవి. కళా పూర్ణోదయం కథ కూడా యిటువంటిదే. కాని పింగళి సూరన దానిని మహా ప్రబంధంగా మలిచాడు. ఈ అపూర్వ చింతామణి కథ కూడా నవలగా కొవ్వలి వారు మలిచారు. తెలుగులో దీనిని వేయి శిరస్సులు ఖండించిన అపూర్వ చింతామణి నవల అన్నారు. పేలవంగా రచించిన ఆధునిక నవలలకంటే నవరసభరితంగా రచించిన కొవ్వలివారి అపూర్వ చింతామణిని రచయితలు జాగ్రత్తగా పరిశీలించాలి. కథా కథన శక్తి మరువరానిది. ఇప్పుడు మనం ఫాంటసీగా వూహించుకునేది యీ రచనలో మాయలుమంత్రాలు తంత్రాలుగా కనిపిస్తాయి. ఊహించనివి జరగటం కదా ఉత్సుకతను రేకెత్తించేది. కథను ఎలా మలుపులు త్రిప్పవచ్చునో వీరినుంచి నేర్చుకోవాలి

●

## నూతన రాగసృష్టి 'నృసింహ భరణి'

"ఒక పాట వింటే కన్నీరొలుకుతుంది. మరో రాగంతో మనసు రాగరంజితమవుతుంది. మరో మనిషి మనసును కుదిపేసి విషాద భరితుల్ని చేస్తుంది. సంగీతానికున్న శక్తి అపారం. అద్భుతం"- ఈ మాటలు ఎవరివో కావు. ప్రధాని పి.వి. నరసింహారావువి.

తెలుగు విశ్వవిద్యాలయం ప్రోఛాన్సలర్, ప్రముఖ వాగ్గేయ కారుడు డాక్టర్ మంగళం పల్లి బాల మురళీకృష్ణ ఇటీవల 'నృసింహ భరణి' అనే ఒక కొత్త రాగాన్ని సృష్టించి ప్రధాన మంత్రి పి.వి. నరసింహారావుకు అంకితమిచ్చారు. ఈ సందర్భంగా డిసెంబర్ రెండవ తేదీ హైదరాబాద్ రవీంద్ర భారతిలో' జాతీయ సమగ్రత - గీతం సంగీతం' అనే అంశంపై ఒక సదస్సు జరిగింది.

ప్రతి రాగానికి ఒక ప్రత్యేకత వుంది. రాగాలను శాసించగల సృష్టికర్త డాక్టర్ బాల మురళీకృష్ణ• రాగాలపై వినూత్న పరిశోధనలు సాగిస్తున్న బాలమురళీకృష్ణ నూతనంగా సృష్టించిన 'నృసింహభరణి' రాగాన్ని సభికుల హర్షధ్వానాల మధ్య ఆలపించారు.

ఒక రాగాన్ని సృష్టించడం ఎంత కష్టమో నాకు తెలియనిది కాదు. వద్దు వద్దంటున్నా వినకుండా బాలమురళి ఒక రాగాన్ని తెచ్చి నా మెడలో వేశారు. దీన్ని ఏం చేసుకోవాలో నాకు అర్థం కావడం లేదు అన్నారు ప్రధాని.రాగాలు, పాటలు ప్రజల మనస్సుల మీద ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో అధ్యయనం చేయాలని, సర్వరాగ సమ్మేళనం మనిషిపై చూపే ప్రభావాన్ని నమోదు చేయాలని ప్రధాని కోరారు.

సంగీతానికున్న అత్యద్భుతమైన శక్తితో జాతీయ సమగ్రత సాధించవచ్చన్న ప్రధాని పలుకులు అక్షర సత్యాలు.

- సాహితి